ప్రజాశక్తి
శుక్రవారం 14 మార్చి 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

డిఐఎఫ్‌సి భవనం అందుబాటులోకి వచ్చేనా ?

◆ రూ.25 కోట్లతో పూర్తయిన నిర్మాణం ◆ వినియోగంలోకి రాకపోవడంపై విమర్శలు



ప్రారంభానికి నోచుకోని డిఐఎఫ్‌సి భవనం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా స్థాయిలో ఆర్థిక శాఖకు చెందిన నాలుగు కార్యాలయాల నిర్వహణ కోసం నిర్మించిన డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ కాంప్లెక్స్ (డిఐఎఫ్‌సి) భవనం నిర్మాణం పూర్తయి దాదాపు 9 మాసాలు అయినప్పటికీ వినియోగంలోకి తీసుకురావడంలో తీవ్ర జాప్యం జరుగుతుండడం విమర్శలకు తావిస్తోంది. నూతన భవనం అందుబాటులోకి వస్తే రోజువారీ కార్యకలాపాల నిర్వహణకు ఇబ్బందులు ఉండవని ఈ భవనంలో ఏర్పాటు కావలసిన నాలుగు కార్యాలయాలకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది అంటున్నారు.

కలెక్టరేట్‌కు సమీపంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భవనానికి ఎదురుగా ఉన్న జిల్లా నీటిపారుదల శాఖ కార్యాలయ ఆవరణలో ఈ భవనాన్ని నిర్మించారు. అక్కడ ఉండే పే అండ్ అకౌంట్స్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో దాన్ని తొలగించి అక్కడే రూ.25.20 కోట్లతో ఐదు అంతస్తుల భవన నిర్మాణానికి 2019లో అప్పటి వైసిపి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఐదేళ్లపాటు సాగిన నిర్మాణ పనులు దాదాపు 9 మాసాల క్రితమే పూర్తయ్యాయి. ఒక్కో అంతస్తు పది వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యధిక వస్తువులతో అందంగా సిద్ధం చేసినప్పటికీ నేటికీ వినియోగంలోకి రాలేదు. వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడు విశాఖకు రాజధానిని తరలిస్తామని, అందుకు అనుగుణంగా రాష్ట్ర ట్రెజరీ డైరెక్టర్, సిఎఫ్‌ఎంఎస్ (సమగ్ర ఫైనాన్స్ మేనేజ్మెంట్ సర్వీసెస్) కార్యాలయం కోసం ఈ భవనాన్ని వినియోగించాలని అప్పట్లో భావించి ఐదు అంతస్తులలో రెండు అంతస్తులను సిఎఫ్‌ఎంఎస్‌కు కేటాయించారు. అయితే రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం పోవడం, కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో ఈ భవనంలో ఏర్పాటు చేయవలసిన కార్యాలయాల అంశంపై ప్రాధాన్యత మారింది. మొత్తం భవనాన్ని జిల్లా స్థాయిలో ప్రభుత్వ శాఖలకు చెందిన ఆర్థిక లావాదేవీలను నిర్వహించేందుకు వినియోగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రస్తుతం కలెక్టరేట్ ఆవరణలోని శిథిలమైన భవనంలో జిల్లా ఖజానా శాఖ కార్యాలయం, జిల్లా నీటిపారుదల శాఖ కార్యాలయంలో పే అండ్ అకౌంట్స్ కార్యాలయం కొనసాగుతుండగా, ఎపిజిఎల్ఐ (ప్రభుత్వ బీమా సంస్థ), స్టేట్ ఆడిట్ కార్యాలయాలు ప్రైవేట్ భవనాల్లో ఉన్నాయి. వీటన్నింటినీ నూతన ఐదు అంతస్తుల డిఐఐసి భవనంలోకి తీసుకురావాలన్నది ప్రతిపాదన. ఇదిలా ఉండగా మిగతా 2లో..



మాట్లాడుతున్న విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్

భూముల క్రమబద్ధీకరణపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అభ్యంతరం కాని అనధికారిక ఆక్రమణలు, నివాసయోగ్యమైన కట్టడాల క్రమబద్ధీకరణపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి సత్వర చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన జిఒ 30 ఉద్దేశాలను, ఆవశ్యకతలను ప్రజలకు తెలియపరచాలని, పూర్తి సహకారం అందించాలని సూచించారు. జిఒ ప్రకారం 2019 అక్టోబర్ 15వ తేదీకి ముందు జరిగిన ఆక్రమణలను పరిగణనలోకి తీసుకొని ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో వేర్వేరుగా జరిగిన విశాఖపట్నం, భీమిలి రెవెన్యూ డివిజన్ల కాన్ఫరెన్స్‌లలో ఈ మేరకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఆర్డీవోలు పి.శ్రీలేఖ, సంగీత్ మాథుర్, కలెక్టరేట్ ఎఒ ఈశ్వరరావు, సర్వే శాఖ ఎడి సూర్యారావులతో కలిసి వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులు, పిజిఆర్ఎస్ వేదికగా వచ్చిన వినతుల పరిష్కారంలో చొరవ చూపాలని, వివిధ సమస్యల పరిష్కారం కోసం తమ వద్దకు వచ్చే సామాన్యుల పట్ల సానుకూల వైఖరితో వ్యవహరించాలని, సత్వర సేవలందిస్తూ అండగా నిలవాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అందిస్తున్న సేవలపై సానుకూల వైఖరి వచ్చేలా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని, స్నేహపూర్వక వాతావరణంలో సేవలందించాలని మిగతా 2లో..

డంపింగ్ యార్డ్‌ను తరలించాలి

▶ వార్త 5లో..

ఉక్కు నేతలపై నిర్బంధం
– నేటి నిరసనల నేపథ్యంలో ముందస్తు అరెస్టులు

▶ వార్త మెయిన్‌లో..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

▶ వార్త 3లో..

ప్రజా గాయకుడు పందిరి రాము మృతి

◆ పలు పార్టీల, ప్రజా సంఘాల నాయకులు నివాళి
◆ ఉద్యమాలకు తీరని లోటు : సిపిఎం

ప్రజాశక్తి - మధురవాడ : ప్రజా గాయకుడు, రచయిత, కళాకారుడు పందిరి రాము బుధవారం అర్ధరాత్రి అనారోగ్యంతో కెజిహెచ్‌లో కన్నుమూశారు. ఆయన మృతి వార్త తెలిసి మధురవాడ శివశక్తినగర్‌లోని ఇంటి వద్దకు సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు, సిపిఐ, పౌర సంక్షేమ సంఘం నాయకులు చేరుకొని ఆయన పార్థివ దేహం వద్ద నివాళ్లర్పించారు. రాము భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రజా కళాకారుడు పందిరి రాము అకాలమరణం సిపిఎంకు, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు అన్నారు. రాము ప్రజా ఉద్యమాలకు ఒక శక్తివంటివారన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి విశాఖకు వలస వచ్చి, మాధవధారలో నివాసముంటూ భవన నిర్మాణ కార్మికునిగా పనిచేశారన్నారు. సిఐటియులో చేరి మిగతా 2లో..



రాము పార్థివ దేహం వద్ద నివాళ్లర్పిస్తున్న జగ్గునాయుడు, తదితరులు



రాము (ఫైల్ ఫొటో)

విద్యుత్ ఉత్పత్తిలో సుస్థిర ప్రగతి

◆ తెలుగు రాష్ట్రాల అవసరాలకు తగ్గట్టు సరఫరా ◆ విదేశీ బొగ్గు ఎన్‌టిపిసికి అవసరం లేదు
◆ 165 ఎకరాల ప్లాంట్‌లో 75 ఎకరాల్లో సోలార్ పవర్ ఉత్పత్తి
◆ మీడియా సమావేశంలో ఎన్‌టిపిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ వెల్లడి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల విద్యుత్ అవసరాలను తీర్చడమే కాకుండా అనేక సందర్భాల్లో దేశంలోని కర్నాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల ఎనర్జీ అవసరాలను తీర్చడంలోనూ ఎన్‌టిపిసి (సింహాద్రి) కీలకపాత్ర పోషిస్తూ సుస్థిర ప్రగతి దిశగా ముందుకెళ్తోందని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ వెల్లడించారు. గురువారం ఉదయం విశాఖలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలి బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ స్టేషన్ ఎన్‌టిపిసి సముద్రం నుంచి నీటిని తీసుకుని బొగ్గును మండించడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందన్నారు. అనకాపల్లి జిల్లా పరవాడలో సంస్థ అత్యుత్తమ ఉత్పత్తి సామర్థ్యంతో రోజుకు 2 వేల మెగావాట్లను తయారు చేస్తోందన్నారు. ఎన్‌టిపిసి ప్లాంట్ కు బంగాళాఖాతం, ఏలేరు కాలువనే ప్రధాన నీటి వనరు అని చెప్పారు. ఎపికి 36 శాతం, తెలంగాణకు 38.5 శాతం విద్యుత్‌ను ఆయా రాష్ట్రాల అవసరాలకు అందిస్తున్నామన్నారు. వంద శాతం యాష్‌ను ఉపయోగిస్తున్నామని తెలిపారు. ప్రాచ్య దేశాలకు పైప్‌లైన్ ద్వారా ఎగుమతి చేస్తున్నామని తెలిపారు. త్వరలో పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ను ప్రారంభించబోతున్నామన్నారు. 1200 ఎకరాలు దీనికోసం అవసరం అవుతుందని కేంద్రానికి డిపిఆర్ ప్రతిపాదనలు పంపినట్లు సమీర్ శర్మ తెలిపారు. న్యూక్లియర్ ప్లాంట్ అగ్రిమెంట్‌పై కేంద్ర ప్రభుత్వంతో ఇంకా చర్చలు జరపాల్సి మిగతా 2లో..



మాట్లాడుతున్న సమీర్ శర్మ

మొదటి పేజీ తరువాయి..

డిఐఎఫ్‌సి భవనం అందుబాటులోకి వచ్చేనా ?

ఈ భవనాన్ని నిర్మించిన కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం రూ.3 కోట్లు 50 లక్షల మేరకు బకాయి ఉన్నట్లు తెలిసింది. అంతేకాకుండా, ఈ భవనానికి ఇంతవరకు విద్యుత్తు సౌకర్యం కల్పించలేదు. ఇదొక అవరోధం. తొలుత ఈ భవనానికి ఎల్‌టి విద్యుత్ కనెక్షన్ తీసుకున్నారు. అయితే ఐదు అంతస్తుల భవనం కావడం వల్ల ఎల్‌టి కుదరదని, హెచ్‌టి కనెక్షన్ తీసుకోవాలని విద్యుత్ శాఖ స్పష్టం చేస్తూ షరతు విధించింది. ఆ మేరకు హెచ్‌టి కనెక్షన్ తీసుకున్నప్పటికీ అందుకోసం ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేయవలసి ఉంది. దీని కోసం రూ.24 లక్షలను ఇపిడిసిఎల్‌కు చెల్లించాల్సి ఉంది. ఆ మాత్రం నిధులు చెల్లించక ట్రాన్స్‌ఫారం ఏర్పాటులో జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది. ఇటువంటి చిన్న చిన్న అవరోధాలను అధిగమించడం ప్రభుత్వానికి ఏమంత కష్టం కాదు. ప్రజా ప్రతినిధులు కూడా దీనిపై దృష్టి సారించి ఐదు అంతస్తుల ఆధునిక భవంతిని త్వరగా అందుబాటులో తేవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

విద్యుత్ ఉత్పత్తిలో సుస్థిర ప్రగతి

ఉందన్నారు.

ఎన్‌టిపిసికి బొగ్గు అవసరాలకుగానూ దేశంలో బిగ్ ప్లేయర్లను ఆహ్వానించిందా ? అనే ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ బయట నుంచి బొగ్గును దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఎన్‌టిపిసికి లేదని, అంతర్గతంగానే దేశీయంగా బొగ్గు సరిపడా ఉందని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 1150 మెగా యూనిట్ల కరెంట్ ఉత్పత్తి చేశామని, సోలార్ జనరేషన్ 37 మెగా యూనిట్లు చేశామని తెలిపారు.

సోలార్ ఎనర్జీలో నెంబర్ వన్

165 ఎకరాల్లో 75 ఎకరాలను సోలార్ ఎనర్జీ కోసం వినియోగిస్తూ గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నామన్నారు. 2021లో ఆసియాలోనే మొదటి సోలార్ పవర్ ప్రాజెక్టును తాము ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, కర్నాటక, తమిళనాడు, పాండిచ్చేరి విద్యుత్ డిమాండ్స్‌కు తగ్గట్టుగా ఎనర్జీని అందిస్తున్నామన్నారు. రాగల 39 నెలల్లో 500 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టును ఎన్‌టిపిసి ఏర్పాటు చేసుకోబోతుందని వెల్లడించారు. ఎన్‌టిపిసి (సింహాద్రి) ఏర్పాటై 50 ఏళ్ల అయిన సందర్భంగా ప్లాంట్ చుట్టూ ఉన్న 29 గ్రామాల్లో పలు సిఎస్‌ఆర్ కార్యక్రమాలు చేపడున్నామన్నారు. ముత్యాలమ్మపాలెం, చిన్నపాలెం గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య, నిరంతర విద్యుత్ సరఫరా వంటి సేవలు అందిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో లక్షల మొక్కలను నాటుతున్నామన్నారు. సమావేశంలో జిఎం ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రశాంత జెనా, జిఎం (టిఎస్) ఎస్.పద్మప్రియ, హెచ్ఒ హెచ్‌ఆర్ భక్త బత్సల పాత్ర పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు పందిరి రాము మృతి

సిపిఎం విధానాలకు ఆకర్షితులై ఆ పార్టీలో కొనసాగారన్నారు. ప్రజా ఉద్యమాలకు తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. పెద్దగా చదువులేకపోయినప్పటికీ పాటలు, పౌరాణిక పద్యాలు, ఏకపాత్రాభినయం, నాటకాలు ప్రదర్శించి కార్మికులను, ప్రజలను చైతన్యపరిచారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయన పాడిన, రాసిన ప్రజా ఉద్యమ పాటలు మంచి ఉత్సాహాన్ని ఇచ్చాయన్నారు. ఎక్కడ భూపోరాటాలు జరిగినా, కార్మిక, ప్రజా పోరాటాలు జరిగినా ప్రజానాట్య మండలి కళాకారునిగా పాటలతో చైతన్య వంతం చేసేవారని గుర్తుచేశారు. రాము కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాము భౌతిక కాయాన్ని సందర్శించి నివాళ్లర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, స్థానిక నాయకులు డి.అప్పలరాజు, పి.రాజ్‌కుమార్, పౌరసంక్షేమ సంఘం నాయకులు ఎన్.సూర్యప్రకాష్, వై.ఈశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ, కంచరపాలెం జోన్ కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, పిఎన్ఎం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రమణ, ఎం.చంటి, కెవిపిఎస్ నాయకులు ఎస్.పైడితల్లి, సిఐటియు నాయకులు డి.కొండమ్మ, ఒ.అప్పారావు, బి.సింహాచలం, ఐద్వా నాయకులు బి.భారతి, సుజాత, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు, శేషు, కిరణ్, శ్రావణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

భూముల క్రమబద్ధీకరణపై ప్రత్యేక శ్రద్ధ

సూచించారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలతో మర్యాదగా ఉండాలని, కూర్చోబెట్టి మాట్లాడాలని, వారి సమస్యలను సావధానంగా వినాలని హితవు పలికారు. వారి సంతృప్తే కొలమానంగా రెవెన్యూ సిబ్బంది పనితీరును అంచనా వేస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. రీ సర్వే, మ్యుటేషన్ల ప్రక్రియలో పారదర్శకత లోపించకుండా పని చేయాలని చెప్పారు. భూముల క్రమబద్ధీకరణ విషయంలో చురుగ్గా వ్యవహరించాలని, ఆక్రమణల తాలూక వివరాలను ప్రతి సచివాలయం పరిధిలో ప్రదర్శించాలని ఆదేశించారు. భూముల క్రమబద్ధీకరణకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఏప్రిల్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు. జిఒ 301 ప్రకారం గాజువాక పరిధిలోని భూముల క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు.

కోటరీలో ఉన్నవారే విమర్శలా ?

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కోటరీలో ఉన్నవారే కోటరీపై విమర్శలు చేయటం సరికాదని ఇటీవల వైసిపికి రాజీనామా చేసిన ఎంపీ విజయసాయిరెడ్డిని ఉద్దేశించి మాజీ మంత్రి, వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గురువారం ఉదయం కృష్ణ కాలేజీ వద్ద ఉన్న వైసిపి జిల్లా కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ విజయసాయిరెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. ఆయన పార్టీని వీడి వెళ్లిపోయిన తర్వాత అంతకన్నా పద్ధతిగా మాట్లాడతారని తాము అనుకోవడం లేదన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణపై ఎల్ఐసి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని, సొంత గనులు కేటాయించాలని, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎల్ఐసి ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో విశాఖలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న 20 ఎల్ఐసి కార్యాలయాల ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఈ నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో డివిజన్ వ్యాప్తంగా సుమారు 1000 మంది పాల్గొన్నారు. డివిజన్ కేంద్రం విశాఖపట్నంలో



నిరసన తెలుపుతున్న ఎల్ఐసి ఉద్యోగులు

జరిగిన కార్యక్రమంలో సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలంటూ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు, అన్ని ప్రజా సంఘాలు దాదాపు నాలుగు సంవత్సరాలుగా పోరాటం సాగిస్తున్నాయని చెప్పారు. ఈ పోరాటాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేక ప్యాకేజీ రూ.11440 కోట్లు కేటాయించిందన్నారు. అయితే ఈ ప్యాకేజీ వల్ల స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగేది లేదన్నారు. స్టీల్ ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో నడవాలంటే సొంత గనులు కేటాయించాలన్నారు. లేదంటే సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.కామేశ్వరి, జి.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మూత్రపిండాల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టండి



సైకత శిల్పం వద్ద కలెక్టర్, సిపి తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్/ఎంవిపి.కాలనీ : మూత్రపిండాల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధ్ర ప్రసాద్ అన్నారు. ప్రపంచ కిడ్నీ డే సందర్భంగా ఆసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్‌కె.బీచ్‌లో కిడ్నీల ఆరోగ్యంపై చెన్నయ్ సైకత కళాకారుడు గజేంద్రన్ రూపొందించిన కిడ్నీ సైకత శిల్పాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేహంలో రక్తాన్ని శుభ్ర పరిచే కిడ్నీల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మన దేహంలో వ్యర్థాలను శుద్ధి చేసే అతి ముఖ్యమైన విధిని కిడ్నీలు నిర్వహిస్తాయని చెప్పారు. మన శరీరంలోని అంతర్గత అవయవాల పని తీరు పట్ల జాగ్రత్త వహించాలన్నారు. నిర్ణీత కాల వ్యవధిలో అవసరమైన వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖ బ్రత బాగ్చి మాట్లాడుతూ కిడ్నీలు బాగా పని చేసినన్ని రోజులు ఆరోగ్యం బాగానే ఉంటుందన్నారు. అవి చెడిపోతేనే వాటి విలువ తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఆసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ హాస్పిటల్ డాక్టర్ అమిత్ సాప్లే, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, హాస్పిటల్ యూరాలజిస్ట్ డాక్టర్ పి.శ్రీధర్, నెఫ్రాలజిస్టులు డాక్టర్ ఉదయ్ దీపక్ గజారే, డాక్టర్ వైష్ణవి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైకత శిల్పం

ప్రపంచ కిడ్నీ డేను పురస్కరించుకొని చెన్నైకి చెందిన కళాకారుడు గజేంద్రన్ రంగు రంగుల సైకత శిల్పం రూపొందించారు. కిడ్నీల పనితీరు, వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం, కిడ్నీ అనారోగ్య నివారణపై ప్రధానంగా చెప్పారు.



నెహ్రూ నగర్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పలుచోట్ల ఐద్వా ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఐద్వా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సంఘం జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం 28వ వార్డు పంది మెట్టలో జరిగాయి. సంఘం సీనియర్ నాయకులు జె.సరస్వతి పతాకావిష్కరణ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో జోన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మణి, ఆర్.వరలక్ష్మి మాట్లాడారు. ఐద్వా ఏర్పాటు నేపథ్యాన్ని తెలియజేశారు. మహిళల రక్షణ, హక్కులు, సమానత్వ సాధన కోసం జరిపిన పోరాటాలను వివరించారు. కార్యక్రమంలో బి.సత్యవతి, మల్లీశ్వరి, లక్ష్మి, ఉమ, బుజ్జి, గౌరి, నాగేశ్వరమ్మ, భవాని పాల్గొన్నారు.

ములగాడ : మహిళలపై హింసను అరికట్టాలని ఐద్వా మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్ విమల అన్నారు. ఐద్వా వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం 59వ వార్డు నెహ్రూ నగర్‌లో ఐద్వా జెండాను హెచ్.సత్యవతి ఆవిష్కరించారు కార్యక్రమంలో సీత, భవాని, లక్ష్మి, మంగ, కుసుమ, సింహాచలం, రమణమ్మ, బండియమ్మ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వినియోగదారులు తమకుగల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వికాస్ పాండే అన్నారు. గురువారం దసపల్లా హోటల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న అంతర్జాతీయ కన్స్యూమర్ డే సందర్భంగా జెడిపి ఫంక్షన్ హాల్ వేదికగా 12 రాష్ట్రాల నుంచి వచ్చిన సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జాతీయ కన్స్యూమర్ డే పురస్కరించుకొని ఆ రోజు వినియోగదారుల హక్కులపై సభ్యులకు ఆయా అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల నుంచి వచ్చిన అధికారులు నుండి పలు అంశాలపై చర్చిస్తామన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి



ఆనందపురంలో పరీక్షా సామగ్రితో టెన్త్ విద్యార్థులు

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక పిఎస్ఎం హైస్కూల్లో 80 మంది టెన్త్ విద్యార్థులకు గురువారం స్థానిక కలిగొట్ల స్విగ్గ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ కె శ్రీరామచంద్ర మూర్తి పరీక్షా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఆదర్శ హిందీ ప్రేమీ మండలి గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు, వ్యవస్థాపక అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు, హెచ్ఎం తిరుమలశ్రీదేవి పాల్గొన్నారు **ఆనందపురం :** మండలంలోని రామవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 43 మంది టెన్త్ విద్యార్థులకు మేము సైతం సేవా సొసైటీ అధ్యక్షులు ఎర్ర వెంకట అప్పారావు ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. సొసైటీ సెక్రటరీ ఎం శ్రీనివాసరావు, మాజీగౌరవ అధ్యక్షులు ఎర్ర రమణ బాబు విద్యా కమిటీ వైస్ చైర్మన్ వెంకటరమణ, అక్కిరెడ్డిదేవుడుబాబు, ఎంపిటిసి గొలగాని కృష్ణ, మాజీ చైర్మన్ అక్కిరెడ్డి పెంటయ్య, ఉపాధ్యాయులు ఎం. చంద్రశేఖరరావు, డి.చంద్రశేఖరరావు గణేష్, ఆశా, ఉమా మహేశ్వరి, ఆర్ సోంబాబు, ఎస్ అప్పలరాజు పాల్గొన్నారు

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - గోపాలపట్నం : టెన్త్ విద్యార్థులు బాగా పరీక్షలు రాసి, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని 89 వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ అన్నారు. కొత్తపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు, ప్యాడ్ పెన్నులు పంపిణీ చేశారు. హెచ్ఎం రత్నమాల,ఉపాధ్యాయులు టిడిపి నాయకులు పాల్గొన్నారు

'తప్పుడు కేసులతో బెదిరిస్తున్నారు'

ప్రజాశక్తి- గాజువాక.: ఆలయంలో చోరీపై ఫిర్యాదు చేస్తే కక్షగట్టి తనపై అట్రాసిటీ కేసులు పెడుతున్నారని, వాంబే కాలనీ వెంకటేశ్వర గుడి చైర్మన్ మంత్రి మంజుల అన్నారు. గురువారం విలేకరులతో గత నెల 24న గుడిలో చోరీపై ఆలయ అర్చకులు తాతాచార్యులు, గుడి సేవకురాలు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అదే సమయంలో అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతున్న అసిరినాయుడు అనే వ్యక్తిని పట్టుకుని గట్టిగా నిలదీయగా, నేరాన్ని అంగీకరించడంతో పోలీసులకు అప్పగించామన్నారు. పోలీసుల విచారణలో మరో ముగ్గురి పేర్లు వెల్లడించారన్నారు. ఆలయంలో చోరీపై తాము ఫిర్యాదు చేశామన్న కోపంతో తిరిగి అట్రాసిటీ కేసు పెట్టి బెదిరించడం సరికాదన్నారు.దీనిపై పోలీసులు విచారించి, తప్పుడు కేసు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని, చోరీకేసు నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో పెంటకోట రాజు, కె.జానకి, శరగడం సావిత్రమ్మ, రూప, జి. కుమారి, కె. భవాని, పద్మ కళ, గవర లక్ష్మి, బొబ్బిలి స్వాతి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి- పెందుర్తి : డ్రగ్స్ అనర్థాలపై ప్రజల్లో అవగాహనకు విస్తృత ప్రచారం చేస్తున్నట్లు ఐహెచ్ఆర్సి నేషనల్ చైర్మన్ రాజాన ప్రసాదరావు అన్నారు. గురువారం జివిఎంసి 94వ వార్డు నాయుడుతోట కృష్ణానగర్లోని సంస్థ కార్యాలయంలో జి.అప్పలరాజుకు స్టేట్ ఇన్వెస్టిగేషన్ చైర్మన్గా ఎంపికచేసి, నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నేషనల్ సెక్రెటరీ ఆర్ ఇషిత, విశాఖపట్నం జిల్లా ప్రెసిడెంట్ జి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఉమామహేశ్వరరావు, ఉమెన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సిహెచ్ ఉమాదేవి పాల్గొన్నారు.

గడ్డి కుప్పల దగ్ధం

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని పొట్నూరు గ్రామంలో గురువారం మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. పాడి పశువుల మేత కోసమని రూ.60 వేల పెట్టి కొనుగోలు చేసిన గడ్డి కాలిబూడిదైందని రైతులు అప్పలనాయుడుతో సహా ముగ్గురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గడ్డివామి దగ్ధంతో పశుపోషణ ఎలాగని వారు వాపోతున్నారు. పశువులు పోషణకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోయారు.

ఆధునిక సాంకేతికతపై దృష్టి పెట్టాలి

జాతీయ సాంకేతిక సదస్సులో ముత్తంశెట్టి శ్రీనివాసరావు



జాతీయ సదస్సు ప్రారంభిస్తున్న ముత్తంశెట్టి

ప్రజాశక్తి -తగరపువలస : విద్యార్థులకు తరగతి గది పాఠాలతో పాటు ప్రయోగశాల పరిజ్ఞానం ఎంతో అవసరమని స్థానిక అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక నైపుణ్యాలపై విద్యార్థులు దృష్టి పెట్టాలన్నారు.గురువారం స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ బియాండ్ ఇన్నోవేటివ్, ఎక్స్ 2 కె 25 పేరిట జాతీయ స్థాయి సాంకేతిక సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభించారు.

ఈ సందర్భంగా విశాఖకు చెందిన ప్రాస్పెక్ట్ టెక్నాలజీస్ సిఇఒసుధాకర్ పంతుల మాట్లాడుతూ లక్ష్యాలకు అనుగుణంగా చదువుకోవాలన్నారు. విశాఖకు చెందిన ది డిజిఫెక్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అమల్ రాజ్ మాట్లాడుతూ, ఆర్టిఫీషియల్ రంగంలో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు ఇన్ఫ్రిడ్జ్ ఐటి సొల్యూషన్స్ వైస్ ప్రెసిడెంట్ తోడేటి శ్రీచరణ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఆరోగ్య పరిశోధకంగానూ ఉపయోగ పడుతుందన్నారు ఎపిడిటిఐ నెట్వర్క్ సిఇఒ బిఎంఎస్ ఆకారపు మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ప్రముఖ పాత్ర వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ బి మురళీకృష్ణ, ఎంబివి రాజు, పి రామకృష్ణ, డైరెక్టర్ ఎ చంద్ర శేఖర్, ప్రోగ్రాం కన్వీనర్ జి సత్య నారాయణ, శ్రీలక్ష్మి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్, పాల్గొన్నారు వివిధ కళాశాలల నుంచి 850 మంది విద్యార్థులు పాల్గొని 120 నమూనాలు ప్రదర్శించారు ఉత్తమమైన వాటికి బహుమతులు అందజేశారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై పరిశీలన

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలోని కొబ్బరితోట, మౌలాలిపంజా, ప్రసాద్ గార్డెన్స్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వర రావు సందర్శించారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, రోగులకు వైద్యసేవలు, వ్యాక్సినేషన్తోపాటు ఎన్సిడి 3.0 సర్వే, ఇతర విషయాలపై ఆరీ తీశారు. అభ ఐడి మ్యాపింగ్ శతశాతం పూర్తిచేయాలని వైద్యులు, సిబ్బందికి ఆదేశించారు. పరిసరాలు పరిశుభ్రత, మూమెంట్ రిజిస్టర్ నమోదుపై స్పష్టమైన సూచనలు చేశారు. వైద్యులు, సిబ్బంది నాగభూషణం పాల్గొన్నారు.

పారిశుధ్య పరికరాల కొనుగోలుకు వితరణ



సాయం అందజేస్తున్న శ్రీకాంత్

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 88వ వార్డు పెదనరవలో వార్డు అధ్యక్షుడు ఒబ్బిన జనార్థన శ్రీకాంత్ ఆధ్వర్యంలో జనసేన ఆవిర్భావ సంబరాలు జరుపుకున్నారు. పార్టీ నేతలు, పవన్ అభిమానులు కేకు కట్ చేశారు. అనంతరం పారిశుధ్య పరికరాల కొనుగోలుకు శ్రీకాంత్ తన సొంత నిధులు రూ.పది వేల చెక్కును శానిటరీ ఇన్స్పెక్టర్ జగన్కు అందజేశారు. కార్యక్రమంలో వెంకటరత్నం, గల్లా శ్రీనివాస్, గంగు నాయుడు, సూరిబాబు, మళ్ళ తాతబాబు, లింగం వాసు, గవర రాజు, గవర శీను,ఒమ్మి అప్పలరాజు, ఎల్లపు రాము, మహేష్, నవీన్, కుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-ములగాడ : జివిఎంసి 62వ వార్డు ప్రకాష్ నగర్లో ఐదవ జోన్ కమిషనర్ బి రాము గురువారం విస్తృతంగా పర్యటించారు. వార్డులో శానిటేషన్, మలేరియా కార్మికుల విధులను పరిశీలించి, రెండు విభాగాల పనితీరుపై ఆరా తీసారు. ప్రకాష్ నగర్లో ఓ ఇంటిపై నిర్మిస్తున్న సెల్ టవర్ను పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్సి బి రాము మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడిపొడి చెత్తను వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. చెత్తను రోడ్లపై, కాలువల్లో వేసినట్లు గుర్తించే జరిమానా వేస్తామని హెచ్చరించారు ప్రజా ఆరోగ్య శాఖ సహాయ వైద్యాధికారి సునీల్, శానిటరీ ఇన్స్పెక్టర్లు నవరత్నం, త్రినాథ్, రమేష్, మలేరియా ఇన్స్పెక్టర్ డి. రవికుమార్ పాల్గొన్నారు.

పిఎం సూర్య ఘర్ యోజనపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : కేంద్ర ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా సోలార్ రూఫ్ టాప్ను ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లు తగ్గడంతోపాటు పలు ప్రయోజనాలు న్నాయని ఏపిఈపిడిసిఎల్ మూడవ జోన్ ఆపరేషన్స్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఎపిఇపి డిసిఎల్ ఆధ్వర్యంలో భీమిలి మండలం, ఆర్ తాళ్ళవలస గ్రామ సచివాలయం లో అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ బ్యాంకు ల అధికారులు, వెల్లర్లు, విద్యుత్ వినియోగ దారులు పాల్గొన్నారు. సంస్థ డిఇఇ రొంగలి రమేష్, భీమిలి, చిట్టివలస, అర్బన్, రూరల్, ఆనందపురం ఎఇఇలు యు .సకరయ్య, బొట్ట రవి, హరి కుమార్, సురేష్ పాల్గొన్నారు

ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్స్ డే

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సిహెచ్సిలో గురువారం ల్యాబ్ టెక్నీషియన్ డే ఘనంగా నిర్వహించారు. సిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ ఎం ఫణికుమార్ కేక్ కట్ చేశారు అనంతరం మాట్లాడుతూ, వ్యాధుల నిర్ధారణ, వైద్యంలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర, వారి కృషిని కొనియాడారు. వైద్యులు గోవింద్, హెడ్ నర్స్ కుమారి, ల్యాబ్ టెక్నీషియన్లు రవికుమార్, మాధవ రావు, జయలక్ష్మి, మాధవి, ప్రేమకుమార్ పాల్గొన్నారు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 24, 43వ వార్డుల్ల పలు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, ఉషశ్రీ గురువారం శంకుస్థాపన చేశారు 24వ వార్డులో రూ. పది లక్షలతో పార్కు అభివృద్ధిచ 43వ వార్డులో రూ.14లక్షలతో కల్వర్టులు, సిసి రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. కార్యక్రమంలో శ్యామల దీపిక, నల్ కమిషనర్ శివప్రసాదరావు ఇంజనీరింగ్ అధికారులు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి-ఉక్కు నగరం : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని స్టీల్ప్లాంట్ జనరల్ మేనేజర్, ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్. కుమారస్వామి పిలుపు నిచ్చారు. గురువారం ఉక్కునగరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది .మహిళలు కేక్ కట్ చేసి సందడి చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్ ప్రతినిధులు మోహనరావు, బి. వెంకటేశ్వర్లు, జి.మల్లేశం, ఎస్.బలరాం, పి. చంద్రకిరణ్ పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-ఉక్కునగరం : జాతీయ రహదారిలో కూర్మన్నపాలెం స్టీల్సిటీ జంక్షన్ వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఫార్మా ఉద్యోగులు అక్కడికక్కడే మరణించగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. దువ్వాడ ట్రాఫిక్ పోలీసులు అందజేసిన సమాచారం ప్రకారం, నైట్డ్యూటీ ముగించుకుని, బైక్పై ముగ్గురు ఫార్మా ఉద్యోగులు వస్తుండగా, సిటీ బస్ వెనుకనే ఉండి యూటర్న్ తీసుకుంటున్న సమయంలో ఎపి 39 ఎయు 7929 నెంబర్ గల మోటార్ బైక్ను, అనకాపల్లి వైపు నుంచి గాజువాక వైపు వెళ్తున్న ఎపి 31 పిజె 9797 నెంబర్ గల టిప్పర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు రోడ్డుపై పడిపోగా దువ్వాడకు చెందిన బి రాము (45),జి.శ్రీను (45) అక్కడికక్కడే మృతి చెందారు. జి. శ్రీను(28)కు తీవ్రగాయాలయ్యాయి. దువ్వాడ ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకొని, తీవ్రంగా గాయపడ్డ జి.శ్రీనును కెజిహెచ్కు తరలించారు. ఇద్దరి మృతదేహాలను కెజిహెచ్ మార్చురీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

కాగా ప్రమాదంపై ఆందోళన చెందిన బాధిత కుటుంబీకులు రోడ్డుపై బైఠాయించి, తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. పోలీసులు చాకచక్యంగా పోలీసులు వ్యవహరించి ట్రాఫిక్ను నియంత్రించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -గాజువాక : ఆర్కె. హాస్పిటల్ సందులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రోడ్డుపై మృతదేహం పడి ఉండడాన్ని స్థానికులు చూసి గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాజువాక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా, ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఆ శవాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుని వయస్సు 45ఏళ్ల ఉండొచ్చని భావిస్తున్నారు.


పోగొట్టుకున్న సెల్ఫోన్ లభ్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జపాన్ యాత్రికుడు తోషి యుకిషి షిడ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ గంటల వ్యవధిలోనే పోలీసులు వెతికి బాధితుడికి అందజేశారు. గురువారం విజయనగరం జిల్లా భోగాపురం పోలీస్స్టేషన్ పరిధిలో సెల్ఫోను పోగొట్టుకోగా, స్థానిక క్రైమ్ పోలీస్లకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన క్రైమ్ ఎస్సై సూర్య ప్రకాశరావు, సిబ్బంది రాజేష్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సంబంధిత మొబైల్ ఫోన్ను ట్రేస్ చేసి పట్టుకుని, విదేశీయాత్రికునికి అందజేశారు. దీంతో ఆయన హర్షం వ్యక్తం చేసి, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

బ్రాందీ షాపులో చోరీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని పూడిమడక పంచాయతీ పరిధిలో గంటాలమ్మ బ్రాందీ షాపులో బుధవారం రాత్రి రూ.2.70 లక్షల నగదును దొంగలు అపహరించారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో షట్టర్ లేపి లోపలికి ప్రవేశించి సీసీ కెమెరాలో ఆపుచేసి నగదును దొంగలించారు.

సమస్యల పరిశీలన



చంద్రంపాలెం ఉన్నత పాఠశాల సందర్శనలో రవితేజ

ప్రజాశక్తి -మధురవాడ, : చంద్రంపాలెం జిల్లా ఉన్నత పాఠశాలను గురువారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాలతో యువ నాయకుడు గంటా రవితేజ సందర్శించారు. ఇటీవల విద్యార్థుల్లో క్రమశిక్షణలోపంతో చోటుచేసుకున్న ఘటనలు, పాఠశాల మైదానం, భూగర్భ డ్రైనేజీ సమస్యతో వర్షం కురిస్తే నీరు నిలిచిపోవడం వంటి సమస్యల నేపథ్యంలో పరిశీలన చేశారు. సిసి కెమెరాలు, మరుగుదొడ్లపై హెచ్ఎం గొట్టేటి రవిని అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు చేపడతానన్నారు. టిడిపి సీనియర్ నాయకులు మొల్లి లక్ష్మణరావు, బోయి రమాదేవి, గొరే గురునాథ్,కానూరి అచ్యుత రావు నమ్మి శ్రీను,మామిడి దుర్గారావు, పోతన ప్రసాద్ పాల్గొన్నారు.

అందరికీ హయ్యర్ పెన్షన్ అమలుకు

18న ఇపిఎఫ్ కార్యాలయ ముట్టడి



సమావేశంలో మాట్లాడుతున్న బాబాజీ

ప్రజాశక్తి -తగరపువలస : ఇపిఎస్ 95 పింఛనుదారులందరికీ హయ్యర్ పెన్షన్ అమలుతోపాటు , కనీస పింఛను రూ 9 వేలు ఇవ్వాలని చిట్టి వలస జ్యూట్ మిల్లు పింఛనుదారుల సంఘం నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. గురువారం చిట్టివలస లేబర్ వెల్ఫేర్ సెంటర్‌లో పింఛను దారుల సమావేశంలో సంఘం సీనియర్ నాయకులు సింగిడి అప్పారావు, అధ్యక్షులు కానూరి రాంబాబు, ప్రధాన కార్యదర్శి దామోదర బాబాజీ మాట్లాడుతూ ఐక్య పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకో గలమని స్పష్టం చేశారు. దశల వారీ పోరాటాల్లో భాగంగా ఆల్ పెన్షన ర్ల అసోసియేషన్ పిలుపు మేరకు ఈ నెల 18న ఉదయం 10 గంటలకు విశాఖ ఇపిఎఫ్ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు సమావేశంలో సంఘం సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, కోశాధికారి పంపాన సూర్య నారాయణ, ఉపాధ్యక్షులు సి హెచ్ అప్పారావు పాల్గొన్నారు

హనుమంతువాక కూడలిలో ఫ్లైఓవర్ నిర్మించాలి

• వార్వా, నివాస్ ఆధ్వర్యంలో నిరసన



హనుమంతువాక కూడలిలో నిరసన తెలుపుతున్న వార్వా, నివాస్, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఆరిలోవ : నగరంలో రోజురోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్ దృష్ట్యా హనుమంతువాక కూడలి నుంచి మద్దిలపాలెం వరకు ఫ్లైఓవర్‌ను నిర్మించాలని, మద్దిలపాలెం వద్ద సబ్‌వే ఏర్పాటు చేయాలని వార్వా నివాస్ డిమాండ్ చేసింది. గురువారం ఉదయం హనుమంతువాక కూడలి వద్ద వార్వా ఆధ్వర్యంలో స్థానికులు, ప్రజాసంఘాలతో కలిసి నిరసన చేపట్టింది. నగరంలో ట్రాఫిక్‌ను నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని నినాదాలు చేసారు. ఈ సందర్భంగా వార్వా నివాస్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.ప్రకాష్, బిబి.గణేష్ మాట్లాడుతూ నగర జనాభాతో పాటు శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి విశాఖకు వచ్చే వారికి హనుమంతువాక కూడలి ముఖద్వారంగా ఉందన్నారు. దీంతో హనుమంతువాక కూడలి వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పర్యాటక ప్రదేశాలు, హెల్త్‌సిటీ, విమానాశ్రయానికి వెళ్ళే వారికి హనుమంతువాక కూడలి కీలకం కావడంతో వాహనదారులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి అనుకున్న సమయానికి గమ్యస్థానాలు చేరుకోలేక నానా అవస్థలు పడుతున్నారన్నారు.. కార్యక్రమంలో వార్వా ప్రతినిధులు పిట్లా నారాయణ మూర్తి, జి.వెంకట రమణ, సింహాద్రిరావు, విశాలాక్షినగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు జి.ఎస్.ఎన్.రాజు, తులసిరావు, సిఐటియు నాయకులు వి.నరేంద్రకుమార్, పి.శంకర్ పాల్గొన్నారు.

నిద్ర లేమితో శారీరక, మానసిక రుగ్మతలు



మాట్లాడుతున్న డాక్టర్ రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : నిద్రలేమితో శారీరక, మానసిక సమస్యలు ఉత్పన్నమై, తద్వారా దీర్ఘకాలిక వ్యాధులు వస్తాయని ప్రభుత్వ మానసిక వైద్యశాల పర్యవేక్షకుడు డాక్టర్ ఎన్.ఎన్. రాజు అన్నారు. గురువారం ప్రపంచ నిద్ర దినోత్సవం సందర్భంగా ఎంవిపి కౌన్సల్య కౌన్సెలింగ్ సెంటరు ఆధ్వర్యంలో పబ్లిక్ లైబ్రరీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ ఏడాది నిద్ర ఆరోగ్యాన్ని ప్రాముఖ్యంగా పరిగణించాలనే నినాదంతో అంతరాజ్జీయ నిద్ర దినోత్సవం జరుపుకుంటున్నట్లు వెల్లడించారు. . ప్రతి జీవికి నిద్ర అత్యవసరమని, నిద్ర లేకుండా మనుగడ సాగదన్నారు. నిద్రలో శరీరం ఏమీ చేయకుండా అచేతనవస్థలో ఉండదని, శరీరానికి కావలిసిన అవసరాలను సన్నద్ధం చేసుకుంటుందన్నారు సగటున రోజుకు ఆరేడు గంటలు అవసరమని, నిద్ర ముగిసిన తరువాత కలిగే విశ్రాంత భావన ముఖ్యమన్నారు. నిద్ర లేమితో నిరాసక్తి, నీరసత్వం ఆవహిస్తుందని, చిరాకు, ఆందోళన ప్రస్ఫుటంగా కనిపిస్తాయన్నారు. దీర్ఘకాలం నిద్రలేమితో మధుమేహం, బీపీ, గుండె జబ్బులు అలాగే మతిమరపు వ్యాధి వచ్చే అవకాశాలున్నాయన్నారు సరైన నిద్రకు సమయ పాలన, పౌష్టిక ఆహారం, దినసరి వ్యాయామం వంటి నిర్దిష్ట ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. టీ, కాఫీ, మద్యం మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, యోగా, ధ్యానంతో ఒత్తిడిని తగ్గించుకుని చక్కని నిద్రను సాధించవచ్చన్నారు. వైద్యుల పర్యవేక్షణలో మందుల సాయంతో సుఖ నిద్ర పొందవచ్చన్నారు. కార్యమానికి పిఎస్ కుమార్ స్వాగతం పలుకగా, కౌసల్య కౌన్సెలింగ్ సెంటరు వైద్యుడు డాక్టర్ ఎన్. జి.నిహాల్ వందన సమర్పణ చేసారు.

భెల్ కాంట్రాక్టు కార్మికుల వేతనాల్లో కోత

ప్రజాశక్తి- గాజువాక: భెల్, హెచ్‌పివిపి కాంట్రాక్ట్ కార్మికులకు మార్చి నెల జీతంలో కోత విధించారు. కంపెనీలో 200 మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులు కొన్నేళ్లుగా పనిచేస్తూ, రెగ్యులర్ కార్మికుల మాదిరిగా ఉత్పత్తిలో భాగస్వాములుగాఉన్నారు. వీరికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం, జీతాలు ఇవ్వకపోయినా, తప్పనిసరి పరిస్థితుల్లో పనిచేస్తున్నారు. ఇప్పటివరకు స్కిల్డ్, అన్‌స్కిల్డ్ కార్మికులకు అరకొర వేతనమైనా పూర్తిగా చెల్లిస్తుండగా, ఈనెల జీతంలో మాత్రం సుమారు 70మంది కార్మికులకు ఒక్కొక్కరి జీతం నుంచి రూ.నాలుగు వేలు నుంచి రూ.ఐదు వేలు వరకు కోత విధించారని వారు వాపోతున్నారు. శాశ్వత ఉద్యోగులు మాదిరిగా సేవలు అందిస్తున్న తమ వేతనాల నుంచి ఎందుకు కోత విధించారో అటు భెల్, హెచ్‌పివిపి యాజమాన్యంగానీ, సంబంధిత కాంట్రాక్టర్‌గానీ చెప్పకపోవడంపై వీరంతా ఆందోళన, ఆవేదన చెందుతున్నారు.

15న జాబ్‌మేళా

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : జిల్లా నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో కంచరపాలెం ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ కార్యాలయంలో ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లానైపుణ్యాభివద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో టావ్ డిజిటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, జస్పెర్ ఇండస్ట్రీస్, ఇన్నోవ్ సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని, నిరుద్యోగ అభ్యర్థులకు ఇంటర్యూలునిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ,బిటెక్ పూర్తిచేసిన నిరుద్యోగ యువకులందరూ హాజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులందరూ విశాఖపట్నం,శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందనిచ మరిన్ని వివరాలకు 8555868681 సంప్రదించాలని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు హెట్స్://నైపుణ్యం.అప్.గొవ్.ఇన్/ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుని, అడ్మిట్ కార్డుతో ఇంటర్యూకు హాజరుకావొచ్చన్నారు.స్పాట్ రిజిస్ట్రేషన్ కుడా ఉందని, ఆధార్ నెంబర్, దానికి అనుసంధానమైన మొబైల్ నెంబర్‌తో ఇంటర్యూకు రావాలని సూచించారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో ప్రిన్సిపాల్ శ్రీ వాణి, విద్యార్థులు

ప్రజాశక్తి -తగరపువలస : ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్వచ్చాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులతో చర్చ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి శ్రీవాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు

అపోలోలో కిడ్నీ వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ అనిల్‌కుమార్

ప్రజాశక్తి - ఆరిలోవ : వరల్డ్ కిడ్నీడేను పురస్కరించుకొని గురువారం ఆరిలోవ అపోలో ఆసుపత్రిలో కిడ్నీల పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్. అనిల్‌కుమార్ పాత్రో మాట్లాడుతూ హిమోగ్లోబిన్ తయారీతో పాటు శరీరానికి అత్యవసరమైన కాల్షియం, ఫాస్ఫరస్, సోడియం, పొటాషియం వంటి లవణాల సమతుల్యత కిడ్నీ ద్వారా సాధ్యమవుతుందని,కిడ్నీ వ్యాధిని గుర్తిస్తే ప్రారంభ దశలో సత్వర వైద్యం ద్వారా బయటపడొచ్చన్నారు. నెఫ్రాలజిస్ట్ డాక్టర్. సత్య వంశీధర్ మాట్లాడుతూ నిరంతరం పనిచేసే శరీర అవయవాల్లో గుండెతోపాటు కిడ్నీలు ఒకటని, క్రియాటినిన్ మూత్ర పరీక్షల ద్వారా కిడ్నీ వ్యాధిని గుర్తించవచ్చన్నారు. అధిక రక్తపోటు, ఊబకాయం, అధిక ఉప్పు వినియోగం, నొప్పిని తగ్గించే మాత్రలు దీర్ఘకాలం వాడటం వలన వంశపారంపర్య కారణాలతో కిడ్నీ వ్యాధి ఎక్కువగా ప్రబలుతుందన్నారు. మూత్రంలో రక్తం, ప్రోటీన్లు పోతున్నట్లయితే కిడ్నీకి సంబంధించిన వ్యాధిగా అనుమానించవచ్చన్నారు. సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్. సి.హెచ్ నాయుడు మాట్లాడుతూ కిడ్నీ పూర్తిగా పాడైతే దాతలు ముందుకొస్తే ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు అవకాశం ఉందన్నారు. వేసవి కాలంలో రోజుకు నాలుగు లీటర్ల నీటిని తాగాలని సూచించారు అవగాహన సదస్సులో ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జె. రామచంద్ర, మెడికల్ సూపరింటెండెంట్ వేదుళ్ళ బాలకృష్ణ, మార్కెటింగ్ డిజిఎం వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్ విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు



ఫేర్‌వెల్ పార్టీలో పాల్గొన్న ఓపెన్ టెన్త్ విద్యార్థులు

ప్రజాశక్తి- ఆనందపురం: ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్ విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆనందపురం కేంద్రంలో 16-40ఏళ్లలోపు 164 మంది విద్యార్థులు సార్వత్రిక విధానంలో టెన్త్ పరీక్షలు రాస్తున్నారు. తరగతులు ముగింపు సందర్భంగా ఆత్మీయ వీడ్కోలులో ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్, హెచ్ఎం కెఆర్‌కె. పట్నాయక్ మాట్లాడుతూ, శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.

ప్రథమ స్వచ్ఛంద సంస్థ సీనియర్ ట్రైనింగ్ అసోసియేట్ అరుణ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా విద్యలో డ్రాపౌట్స్‌ను గుర్తించి, వారికి విద్యను అందించి వారి ఆర్థికాభివృద్ధికి టైలరింగ్, కంప్యూటర్ వంటి శిక్షణనిస్తున్నామన్నారు. ప్రథమ రాష్ట్ర కోఆర్డినేటర్ కొండలరావు పాల్గొన్నారు

టెన్త్ హాల్ టిక్కెట్ల పేరుతో వేధిస్తే చర్యలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ఈనెల 17 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్ల జారీలో ఫీజులు పెండింగ్ నెపంతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం హెచ్చరించారు. హాల్ టికెట్లలో స్కూల్ ప్రిన్సిపాల్ సంతకాలు, స్టాంపులు ఉండాలన్న నిబంధనలు పెట్టి జిల్లాలో పలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదులు అందడంపై సీరియస్‌గా స్పందించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన సూచనలు జారీ చేసిందని, ఆన్‌లైన్‌లో నేరుగా హాల్‌టిక్కెట్లు తీసుకునే సౌలభ్యం ఉన్నందున విద్యార్థులు ఆయా హాల్‌టిక్కెట్లతో నిరభ్యంతరంగా పరీక్షలు రాయొచ్చన్నారు.

టెన్త్ హాల్‌టిక్కెట్ల జారీపై కమిషన్ ఛైర్‌పర్సన్ కేసలి అప్పారావు, ఇప్పటికే అందరు డిఇఒలకు స్పష్టమైన ఆదేశాలిచ్చారన్నారు. .సమస్యలుంటే apscpcr2018 @gmail.com కు ఫిర్యాదులు చేయవచ్చని సీతారాం సూచించారు.

వైభవంగా పద్మనాభుని రథోత్సవం

ప్రజాశక్తి -పద్మనాభం : అనంత పద్మనాభ స్వామి రథోత్సవాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇఒ నానాజీ బాబు ఆధ్వర్యంలో గాలిగోపురం వద్ద స్వామి రథాన్ని పూలమాలలు, విద్యుద్దీపాలతో అలంకరించి, కుంతీ మాధవస్వామి ఆలయంలో ఉన్న శ్రీదేవికి భూదేవికి సమేత అనంతపద్మనాభ స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ పురోహితులు సీతారామాంజనేయులు ఆధ్వర్యంలో రథంలో ప్రతిష్ఠించారు. ఆలయ ఆచారం ప్రకారం పద్మనాభం పోలీస్‌స్టేషన్ సిఐ సిహెచ్ శ్రీధర్‌ను తన కార్యాలయానికి వెళ్ళి సన్నాయి మేళాలతో ఆహ్వానించి, రథం వద్దకు తీసుకొచ్చి, రథోత్సవాన్ని ప్రారంభింపజేశారు రథంపై ఉన్న ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, పురవీధుల్లో ఊరేగించారు. పోలీసులు పటిష్టభద్రతా చర్యలు చేపట్టారు. భక్తుల సహకారంతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఘనంగా ముత్యమాంబ ఉత్సవం

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు వేపగుంటలో ముత్యమాంబ పండగ గురువారం ఘనంగా నిర్వహించారు అమ్మవారికి భక్తులు పసుపు కుంకుమలను చెల్లించుకున్నారు ఆలయ కమిటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు

పట్టణం మధ్యలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను తరలించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

పట్టణం మధ్యలో జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌ను తరలించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సిపిఎం బృందం డంపింగ్ యార్డును పరిశీలించింది. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ఈ డంపింగ్ యార్డ్ వలన వుడ్‌పేట, వేల్పుల వీధి, నెహ్రూ చౌక్ వంటి ప్రాంతాలు తీవ్రమైన దుర్వాసనతో, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఊరి మీద చెత్తనంతా తీసుకొచ్చి మున్సిపల్ కార్యాలయంలో వేయడం దేశంలో ఎక్కడా లేదన్నారు. ఈ డంపింగ్ యార్డు వల్ల అనకాపల్లి పట్టణం దోమలతో నిండిపోయి డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలుతున్నాయని పేర్కొన్నారు. పక్కనే ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఉన్నాయని, విద్యార్థులు దుర్వాసనతో తీవ్రమైన అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని వాపోయారు. అనకాపల్లి నుంచి రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగినప్పటికీ అతి ముఖ్యమైన ఈ సమస్యను పరిష్కరించక పోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ డంపింగ్ యార్డ్‌ను పట్టణం బయట ప్రదేశానికి తరలించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలను చైతన్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం పట్టణంలోని ఉడ్డుపేట, విజయరామరాజుపేట, బర్మ కాలనీ, లెపర్సీ కాలనీల్లో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు బి.ఉమామహేశ్వరరావు, అల్లు రాజు, కాళ్ళ తేలయ్యబాబు, పి.చలపతి, బి.నూక అప్పారావు, వికలాంగుల సంఘం నాయకులు ఎస్. వీరూయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



జోనల్ కార్యాలయం పక్కనున్న డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

విద్యుత్ వినియోగదారుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-పరవాడ : ఎపిఇపిడిసిఎల్ పర్యవేక్షణలో, కన్స్యూమర్ గ్రీవెన్స్ రీడ్రెస్సెల్ ఫోరం వారి ఆధ్వర్యంలో పరవాడ మండలంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ సమస్యల పరిష్కార కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. వీటిని చైర్ పర్సన్ (రిటైర్డ్ జడ్జి) డాక్టర్ బి.సత్యనారాయణ స్వీకరించారు. పరవాడ మండలం గొర్లివానిపాలెం గ్రామం 1వ వార్డ్‌లో విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న హెచ్చు తగ్గులు కారణంగా గృహోపకరణాలకు నష్టం జరుగుతుందని, దానిని నివారించాలని ఆ గ్రామస్తులు కోరారు. విద్యుత్ వినియోగదారుల గృహోపకరణాలకు జరుగుచున్న నష్టాన్ని నివారించుటకు సంబంధిత అధికారులు తగు ఆదేశాలు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిప్పాడ రామారావు, టి. గోవిందరావు, పి.అప్పారావు, సి. హెచ్.అప్పారావు, పి.మహాలక్ష్మి పాల్గొన్నారు.

వైసిపి నేత కన్నబాబును కలిసిన రవికుమార్

ప్రజాశక్తి-సబ్బవరం : రాష్ట్ర మాజీ మంత్రి, వైసిపి ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబును ఆయన క్యాంపు కార్యాలయంలో పెందుర్తి నియోజకవర్గం వైస్సార్సీపీ నాయకులు గండి రవికుమార్ గురువారం మార్యాదపూర్వకంగా కలిశారు. పెందుర్తి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, నిత్యం పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు అండగా ఉండాలని, ప్రజలు తరుపున ప్రభుత్వంపై పోరాడాలని రవికుమార్‌కు కన్నబాబు సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు యడ్ల నాయుడు, సిరపరపు వాసు , కరక రాము , గురి శ్రీనివాస్ , గండి రవికుమార్ యువ సైన్యం ఉన్నారు.

సిఎంను కలిసిన బ్రాండిక్స్ భాగస్వామి దొరైస్వామి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఇండియా అపరల్ సిటీ భారతీయ భాగస్వామి దొరైస్వామి గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. అచ్యుతాపురం బ్రాండిక్స్ అపెరల్, వస్త్ర పరిశ్రమ రంగంలో సాధించిన ప్రగతి విశేషాలు, గ్రామీణ మహిళలు, యువతకు కల్పించిన ఉపాధి, భవిష్యత్తు ప్రణాళికలను చంద్రబాబుకు వివరించారు. ఇప్పటివరకూ బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీగా వున్న సంస్థ పేరును అధిష్ఠాన్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్కుగా మార్చినట్టు చెప్పారు. పేరుమార్పుతో పాటు భవిష్యత్తు ప్రణాళికల గురించి తెలియజేశారు. బ్రాండిక్స్‌లో ఇప్పటికే 20 వేల మందికి ఐదో తరగతి కనీస విద్యార్హత స్థాయి మహిళలు, ఒంటరి మహిళలకు ఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. మరో 20 వేల మందికి ఉపాధి కల్పించే దిశగా చర్యలను వేగవంతం చేయాలని చంద్రబాబు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం, సహకారం కావాల్సినా అందిస్తామన్నారు.



చంద్రబాబుకు మొక్క ఇస్తున్న దొరైస్వామి

16న రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

ప్రజాశక్తి-కశింకోట : మాకవరపాలెం మండలం తామరం అవంతి కాలేజీలో కన్నూరుపాలెం ప్రగతి చెస్ అకాడమి ఆధ్వర్యంలో దువ్వూరు మోహన్‌రావు రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ఈ నెల 16న నిర్వహిస్తున్నట్లు అకాడమి డైరెక్టర్ గాయత్రి దేవి, గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు రూ.33 వేలు నగదు బహుమతులు అందిస్తామన్నారు. అన్ని వయస్సుల వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు.

స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో అందరూ పాల్గొనాలి

జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించాలని, ప్రతి ఉద్యోగి పాల్గొనాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ఆదేశించారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం మార్చి 15న మూడవ శనివారం నిర్వహించే శుభ్రత కార్యక్రమాలపై గురువారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా, డివిజను, మండల స్థాయి అధికారులతో కలెక్టరు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించడం జరిగిందని, దాని అమ్మకాలు, కొనుగోలుదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలు, విద్యా కేంద్రాలు, కార్యాలయాలు, పరిశ్రమల్లో స్వచ్ఛత కార్యక్రమాలు అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేపట్టాలని సూచించారు. మునిసిపాలిటీల పరిధిలో కనీసం 30 సెంట్లలో మొక్కలు నాటాలన్నారు. గ్రామాలు, పట్టణాలలో కాలువలలో పూడిక తీయించాలని, మురుగునీరు నేరుగా చెరువులు, సాగునీటి కాలువలు, మంచినీటి వనరులలో కలువకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా మంచి పనితీరు కనబరచిన స్వచ్ఛవార్డు, స్వచ్ఛ పాఠశాల, స్వచ్ఛ అపార్టుమెంటు, స్వచ్ఛ కళాశాల, స్వచ్ఛ బస్టాండు, రైల్వే స్టేషనులను గుర్తించి అవార్డులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యకమానికి ప్రతి జిల్లా కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకొని పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమం అనంతరం ఎస్ఎఎస్ఎ యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ వై.సత్యనారాయణరావు, జిల్లా గణాంకాధికారి జి.రామారావు, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డెరెక్టరు కె.శచీదేవి, పంచాయతీ రిసోర్స్ సెంటరు జిల్లా కో ఆర్డినేటరు ఇ. నాగలక్ష్మి, జిల్లా ప్రజా రవాణా అధికారి కె. పద్మావతి, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి కే రాజేశ్వరి, డిపిఒ ఆర్.శిరీషారాణి, డ్వామా ప్రోజెక్టు డైరెక్టర్ బి.పూర్ణమాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

10వ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

అనకాపల్లి : జిల్లాలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా గురువారం కలెక్టరు కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ మార్చి 17వ తేది నుండి ఏప్రిల్ 1వ తేది వరకు 107 సెంటర్లలో నిర్వహిస్తున్న పదవతరగతి పరీక్షలకు 22వేల మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి, ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో పక్కాగా ఏర్పాట్లు ఉండాలని, మౌళిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు ముందుగా చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని, పరీక్షా కేంద్రంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని కోరారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షను అమలు చేయాలని, దగ్గరలోని జెరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలలతో ఎక్కడా మాస్ కాపీయింగు జరుగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల సహాయ కమిషనరు శ్రీధర్ రెడ్డి, వైద్యశాఖ, పోలీసు, ఎలక్ట్రికల్, పోస్టలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

డైట్‌కు ఐఎస్‌ఒ ప్రామాణిక ధ్రువీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీకు ఐఎస్ఓ ప్రామాణిక ధ్రువీకరణ మరోసారి లభించింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ రత్నాకర్ మాట్లాడుతూ 2006లో ప్రారంభించి ఇప్పటికీ నుండి నాణ్యమైన విద్యాభ్యాసాన్ని విద్యార్థులకు అందించడం జరుగుతోందన్నారు. అనేక అక్రిడిటేషన్లు ఎప్పటికప్పుడు పొందడం, ఇప్పటికే నేక్ అక్రిడిషన్, అటానమస్, హెూదాతో విద్యా విధానంలో మరిన్ని నూతన ఒరవడికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ఐఎస్ఓ సర్టిఫికెట్ కూడా గత 15 సంవత్సరం నుంచి మెయింటైన్ చేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం కూడా నూతనంగా ఐఏఎస్ సర్టిఫికెట్‌ను రెన్యువల్ చేయడం జరిగిందన్నారు. ఈ నూతన సర్టిఫికెట్స్ ద్వారా మరింత ఉత్తమ విద్యను విద్యార్థులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

కల్యాణ మండపం నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడులో కోటి రూపాయలతో కళ్యాణ మండప నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, విఎంఆర్‌డిఎ అధికారులు గురువారం స్థల పరిశీలన చేశారు. ప్రభుత్వ కార్యాలయాలను ఆనుకుని గతంలో గ్రామస్తులు కొనుగోలు చేసిన ఆర ఎకార స్థలంలో విఎంఆర్‌డిఎ నిధులతో ఆధునిక కళ్యాణ మండపం నిర్మాణం చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి.కుమార్, విఎంఆర్డిఏ జాయింట్ కమిషనర్ రమేష్, చీఫ్ ఇంజనీర్ వినయ్ కుమార్, సూపరింటెండెంట్ ఇంజనీర్ భవాని శంకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబు, మాజీ సర్పంచ్ డోకల లక్ష్మీనరసింహమూర్తి స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొణతాలకు ఎపిడబ్ల్యుజెఎఫ్ కృతజ్ఞతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు అంశాన్ని అసెంబ్లీలో లేవనెత్తిన అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు జర్నలిస్టుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షులు భీమరశెట్టి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి బి.ఈశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి మంత్రి అనగాని సత్య ప్రసాద్ స్పందించి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని చెప్పడం హర్షణీయమన్నారు.

క్రీడల్లో ఆంధ్ర మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య ఆరోగ్య శాస్త్రాల విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 26వ రాష్ట్ర అంతర్ వైద్య కళాశాలల క్రీడా పోటీలు ఈ నెల 8 నుంచి 11 వరకు గన్నవరంలోని చిన్న అవుట్ పల్లిలో డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలలో జరగ్గా ఆంధ్ర మెడికల్ కాలేజీ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి విశేష విజయాలను సాధించారు. వాలీబాల్ పోటీలో కరుణాకర్ రాజు (కెప్టెన్) నేతృత్వంలో అద్భుత ఆటతీరు కనబరిచి విజేతగా నిలిచారు. అలాగే బాల్ బ్యాడ్మింటన్ పోటీలో భాను ప్రకాష్ (కెప్టెన్) ఆధ్వర్యంలో హోరాహోరీ పోరాటం చేసి రన్నరప్ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ విజయాల సందర్భంగా ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్ఎం.సంధ్యాదేవి విజేతలకు అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. క్రీడలతో పాటు విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో భాను సతీష్, డాక్టర్ ఎంఎస్ఎన్.పాత్రుడు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరించిన బత్తుల

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మంగళగిరి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు గురువారం ప్రజల నుండి వినతులు స్వీకరించారు. రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన ప్రజల సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేసి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలని కోరారు.



వినతులు స్వీకరిస్తున్న బత్తుల తాతయ్యబాబు



దగ్గరుండి పారిశుధ్య పనులు చేయిస్తున్న అధికారులు

చోడవరంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పంచాయతీ పరిధిలో చీడికాడ రోడ్డు, లక్ష్మీపురం రోడ్‌లో ఉన్న డంపింగ్ చేసిన చెత్తను ఈవోపీఆర్డి మహేష్ పర్యవేక్షణలో ఈవో నారాయణరావు పంచాయతీ సిబ్బందితో కలిసి గురువారం పెద్ద ఎత్తున పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డి మహేష్ మాట్లాడుతూ పట్టణంలో బిల్డింగులు తొలగించిన వేస్టేజ్‌ను రోడ్డుకు ఇరువైపుల వేయడం, దుకాణాదారులు వ్యాపారాల దగ్గర మిగిలిపోయిన చెత్తను పడవేయడంతో అపరిశుభ్రత నెలకొంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డి పర్యవేక్షణ అధికారి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలకు అచ్యుతాపురం సంత వేలం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం శుక్రవారం వారపు సంత వేలంపాట గురువారం పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామ సర్పంచ్ కె విమలా నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. పాటను గల్లా నాగమణి రూ.10.11లక్షలకు పాడారు. సంత వేలం పాట కార్యక్రమంలో ఈవోపిఆర్‌డి చుక్క శ్రీరాములు నాయుడు, పంచాయతీ కార్యదర్శి శైలజారాణి, డి బాబ్జి, కే.వెంకు నాయుడు, కూనిశెట్టి రమణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక సబ్ స్టేషన్ మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఈ నెల 14న శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఈఈ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని మునగపాక, వాడ్రాపల్లి, మూలపేట, అరబుపాలెం, తిమ్మరాజుపేట, పాటిపల్లి, గొల్లల పాలెం, కుంచావనిపాలెం, మల్లవరం, అప్పికొండ వారిపాలెం, నాగవరం గ్రామాల ప్రజలు విద్యుత్తు అంతరాయానికి సహకరించాలని కోరారు.

టెన్త్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని బయ్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం గురువారం ఉత్సాహంగా ఉల్లాసంగా జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జివి రమణ మాట్లాడుతూ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత పొందాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

గ్లకోమాపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : గ్లాకోమా వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి తనిఖీ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంటి చూపుపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్వీ పద్మావతి, ఉపాధ్యాయులు, విజన్ టెక్నీషియన్ సాయికుమార్, సంఘమిత్ర రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ప్రధాన కార్యదర్శి బొంతు మంగపతిరావు ఫీల్డ్ వర్కర్ సంతోషి పాల్గొన్నారు.

పదిలో ప్రతిభావంతులకు నగదు పురస్కారాలు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది కేపిడి జెడ్పీ హైస్కూల్లో గతేడాది టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రతిభావంతులకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు గురువారం నగదు పురస్కారాలు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన బి.నాగేశ్వరి, అడపా హర్ష, గేదెల అమృతలకు రూ.8వేలు, రూ.5వేలు, రూ.3వేలు చొప్పున అందించారు. మరో ముగ్గురు పేద విద్యార్థులు కుబిరెడ్డి మానస, సకల కార్తీక్, పప్పల మృదులకు రూ.5వేలు చొప్పున ఆర్థిక సాయం చేశారు. సంఘం ప్రతినిధులు ఎస్వీ రమణ, కోవెల రవి, కోవెల జనార్ధనరావు, ఎస్ వరహాలు బాబు, దాడి గోవింద, సుసర్ల హరికుమార్, ఎస్ భాస్కరరావు, గరికిపాటి మేఘారావు, పినపాత్రుని సాంబశివరావు పాల్గొన్నారు.

పెదపూడిలో తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పెదపూడి గ్రామంలో జడ్పీటీసీ దొండా రాంబాబు నూతన తాగునీటి బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ వేసవిలో గ్రామాలలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్పంచ్ గోకివాడ వరకృష్ణ, ఎంపీటీసీ గోకివాడ రాము తదితరులు పాల్గొన్నారు.

జీడి పిక్కలకు మద్దతు ధర ఇవ్వాలని ఆందోళన

24, 25 తేదీల్లో ధర్నాలను జయప్రదం చేయాలని సిపిఎం నేతల పిలుపు



ఆందోళన చేస్తున్న జీడి పిక్కల రైతులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

జీడి పిక్కలకు మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన దేవరాపల్లి మండలం గర్సింగి పంచాయతీ పరిధిలోని నాలుగు గిరిజన గ్రామాల గిరిజన రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి దొర మాట్లాడుతూ జీడి పిక్కల మద్దతు ధర కేజీకి రూ.200 ఇవ్వాలని, రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జీడి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ సౌకర్యం కల్పించకపోవడం, ప్రభుత్వం ధర నిర్ణయించకపోవడంతో వ్యాపారులు ధర తగ్గించి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. వ్యాపారుల చేతికి జీడిపిక్కలు చేరిన తరువాత అమాంతంగా జీడి ధర పెరుగుపోతుందని పేర్కొన్నారు. దీంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రాక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 80 కేజీల జీడి పిక్కల బస్తాకు వ్యాపారులు రూ.8వేలకు మాత్రమే ఇస్తున్నారని, అవే పిక్కల ద్వారా వ్యాపారులకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం రూ.19,400 ఆదాయం వస్తుందని చెప్పారు. మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకొని జీడి రైతులకు 80 కేజీల పిక్కలకు కనీసం రూ.16వేలు చెల్లించాలని కోరారు. వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు వదలకుండా జీడి పిక్కలకు గిట్టుబాటు ధర, మార్కెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై ఈనెల 24, 25 తేదీలో జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాలు వద్ద జరుగు ధర్నాల్లో జీడి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గిరిజన రైతులు పాల్గొన్నారు.

స్థల సమస్యపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు



ఎమ్మెల్యే బండారును కలిసిన లంకవానిపాలెం గ్రామస్తులు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని లంకవానిపాలెం గ్రామానికి చెందిన మహిళలు ఆ గ్రామంలో ఉన్న స్థల సమస్యపై మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని గురువారం కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా లంకవానిపాలెం గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 98 సెంట్లు స్థలాన్ని తమ పూర్వీకుల నుంచి అనుభవిస్తున్నామని తెలిపారు. అయితే ఈ మధ్య కాలంలో ఆ గ్రామానికి చెందిన ఒక ఉపాధ్యాయుడు ఆ స్థలాన్ని ఆక్రమించాలని కుట్రతో ఆ స్థలాన్ని తాను కొనుగోలు చేశానని, అందులో ఏ ఒక్కరు అడుగు పెట్టకూడదని తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ స్థలానికి ఆనుకొని ఉన్న రెండు షాపులను ఫిబ్రవరి 3న గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి దగ్ధం చేయడానికి ప్రయత్నం చేయగా తాము, గ్రామస్తులు అడ్డుకున్నట్లు చెప్పారు. ఆ స్థలం దేవాదాయ శాఖకు చెందినదని బోర్డు కూడా ఉందని, అందులో గతంలో గ్రామస్తులు శుభకార్యాలు చేసుకునేవారని తెలిపారు. అయితే పోలీసులు సదరు ఉపాధ్యాయునికే కొమ్ముకాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇకపై పోలీసులు కూడా ఆ స్థలం గురించి రారని, దేవాదాయశాఖ అధికారులకు తాను చెబుతానని, ఇకపై ఆ స్థలాన్ని గతంలో మాదిరిగా శుభకార్యాలు జరుపుకోవాలని, ఏ ఒక్కరు ఆ స్థలం జోలికి వచ్చినా, వాటాదారులను భయభ్రాంతులకు గురిచేసినా వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాల ప్రజలకు రేషన్ సరుకుల పంపిణీ వ్యవస్థ, ఇతర పథకాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందించాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు గంజిమాల దేవి అధికారులను ఆదేశించారు. జిల్లాలో రెండో రోజు క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం ఆమె జిల్లాలోని పలు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎన్.మూర్తి ఇతర అధికారులతో కలిసి అనకాపల్లి గవరపాలెం ఎపిబిసి సంక్షేమ గురుకుల పాఠశాల, కొత్తూరు, ముత్రాసికాలనీ అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. రికార్డులు, ఆహారపదార్థాల నిల్వలు, పదార్థాల నాణ్యత పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ శతశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. సివిల్ సప్లై, మహిళా, శిశు అభివృద్ధి, పాఠశాల విద్య, ఫుడ్ సేఫ్టీ, తూనికలు, కొలతల శాఖల అధికారులు పాల్గొన్నారు.

యలమంచిలి : స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి గురువారం యలమంచిలి రైల్వే స్టేషన్ రోడ్డు జెడ్పీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎండిఎం నిర్వాహకులతో మాట్లాడారు. సరిపడా ఆహారం పెట్టడం లేదని, గుడ్లు అందరికీ సరిపోవడం లేదని, చిమిడిన అన్నం పెడుతుంటారని ఆరోపణలు రావడంతో విద్యాశాఖ అధికారులను పిలిచి సంజాయిషీ అడిగారు. ఇక ముందు కూడా ఇలాగే కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్తపేట హైస్కూల్‌ను సందర్శించి పరిశీలించారు. అయితే ఇటువంటి అధికారిక పర్యటనలు, సందర్శనలను ప్రజాప్రతినిధులు, విలేకర్లకు తెలియకుండా అధికారులు నిర్వహించడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధుల్లో వ్యతిరేకత ఎదురౌతోంది.

18న మిడ్డేమీల్స్ కార్మికుల చలో విజయవాడను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-చోడవరం : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 18వ తేదీన విజయవాడలో జరుగు ధర్నాను విజయవంతం చేయాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి పిలుపునిచ్చారు. మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కుకింగ్ కాస్ట్ పెంచాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, రాజకీయ వేధింపులు అక్రమ తొలగింపులు ఆపాలని, స్కూల్ విలీనం పేరుతో తొలగించిన కార్మికులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని తదితర డిమాండ్లతో యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు ఈ ధర్నా జరుగుతుందని, మిడ్డేమీల్స్ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

జనసేన ఆవిర్భావ సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-యలమంచిలి : పిఠాపురంలో శుక్రవారం సాయంత్రం జరిగే జనసేన ఆవిర్భావ సభకు పార్టీ నేతలు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఉదయం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ యలమంచిలి మున్సిపాలిటీ నుండి 300 బైక్‌లు, 25 కార్లతో పిఠాపురానికి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మరో రెండు భారీ బస్సులలో మహిళా కార్యకర్తలను తరలిస్తామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు బొద్దపు శ్రీనివాసరావు, కె.నరేశ్, కొంకారు శ్రీనివాస్, వి.రమేశ్, గుర్రాల శేఖర్, సోమలింగపాలెం యూనిస్ పాల్గొన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలుగు మహిళ కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ (మొల్ల) జయంతి వేడుకలు అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎపి గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర పాల్గొని ముందుగా మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్, మళ్ళ సురేంద్ర మాట్లాడుతూ మొల్ల 1440 మార్చి 13వ నెల్లూరు జిల్లా గోపవరం గ్రామంలో జన్మించినట్లు చెప్పారు. రామాయణాన్ని తెలుగులో అనువదించి ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించారన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ సత్యనారాయణరావు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజేశ్వరి, కుమ్మరి శాలివాహన సంఘం నాయకులు సైనిక్ సత్యనారాయణ, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని గొర్లివానిపాలెం కాలనీలో అతుకూరి మొల్లమాంబ 585 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొల్ల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గొర్లివానిపాలెం పంచాయతీ వార్డ్ మెంబర్ అనకాపల్లి అన్నపూర్ణ, చూసుకొండి రాజు, అనకాపల్లి అప్పారావు, చూచుకొండ వెంకట భవాని, అనకాపల్లి దేవి, అనకాపల్లి ఈశ్వరమ్మ, అనకాపల్లి ఆదిలక్ష్మి, అనకాపల్లి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రులను కలిసిన ప్రగడ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : రాష్ట్ర మంత్రులను ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎలమంచిలి నియోజకవర్గంలో ఎదుర్కొంటున్న సమస్యలను కార్మిక శాఖ, న్యాయశాఖ, రెవెన్యూ, శిశు సంక్షేమ సాంఘిక సంక్షేమ మంత్రులకు తెలియజేశారు. నిర్వాసితులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకువెళ్లారు.

బోదకాలు నివారణపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : బోదకాలు నివారణకు ముందు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి డాక్టర్ మానస, డాక్టర్ రవిబాబు అన్నారు. మండలంలోని హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోదకాలు సమస్య క్యూలెక్స్ రకం దోమ కుట్టడం వలన వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.శ్రీనివాస్, ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమామహేష్, వైద్యసిబ్బంది గణేష్, ఇందిర, లక్ష్మి, నాగేశ్వరరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గెడ్డవాగు ఆక్రమణను తొలగించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం దేవుడు చెరువుకు నీరు ప్రవహించే గెడ్డవాగు ఆక్రమణను తొలగించాలని సబ్బవరం మేజర్ పంచాయతీ ఒకటో వార్డు మెంబర్ కొల్లి దేవుడమ్మ సబ్బవరం పంచాయతీ ఈవో కె శ్రీనివాసరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. సర్వేనెంబర్ 271 నుండి దేవుడు చెరువుకు నీరు ప్రవహించే గెడ్డ వాగును కొంతమంది ఆక్రమణ చేసి అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నారని, వాటికి అనుమతులు, ఇంటి పన్నులు ఇవ్వకుండా నిలిపి వేయాలని కోరారు. దేవుడు చెరువుకు నీటి పరివాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా కాపాడాలని కోరారు. దేవుడు చెరువును కూడా సర్వే చేసి, ఆ చెరువులో దురాక్రమణలను తొలగించాలని పలు ప్రజాసంఘాలు కోరుతున్నాయి. ఈ కార్యక్రమంలో కొల్లి గంగునాయుడు, కొల్లి అచ్చన్న, బంగారునాయుడుపాల్గొన్నారు.

తాగునీటికి గిరిజనుల అవస్థలు



గెడ్డలో నీటిని తోడుతున్న గిరిజన మహిళలు

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం చీమలపాడు శివారు సోంపురం బంద ఆదివాసీ గిరిజన గ్రామంలో తాగునిటీ ఎద్దడి నెలకొంది. తాగునిటీ కోసం మైళ్ళు దూరంలో కొండ గెడ్డల నుంచి ఊట నీరు సేకరిస్తూ కాలం నెట్టి కోస్తున్నామని స్థానిక గిరిజనులు వాపోతున్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ మహిళ లు మర్రి చిలుకమ్మ, మర్రి గౌరీ తదితరులు స్థానిక విలేకరుల తో మాట్లాడుతూ, తమ గ్రామానికి తాగు నీటి సౌకర్యం లేదన్నారు. కొండల నుంచి జలవారుతున్న ఊట నీరే గతన్నారు.ఈ నీరు తాగడం తో చిన్న పిల్లలతో సహ తరచూ తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అనారోగ్యానికి గురైతే రోడ్డు సదుపాయం లేక డోలి మోతలు తప్పలేదని ఆవేదన చెందారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాని మంత్రి జల జీవన్ పథకం ద్వారా తాగు నీటి వసతి కల్పించాలని కోరారు. మినీ రక్షత తాగునిటీ పథకం, రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆదివాసీ గిరిజన మహిళ లు కోరారు.



నీటిని మోసుకెళుతున్న మహిళలు



కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

ఆకట్టుకున్న మహిళల కోలాటం

ప్రజాశక్తి-నక్కపల్లి:ఉపమాక వెంకన్న వార్షిక కళ్యాణోత్సవంలో భాగంగా గురువారం ఆలయ కళ్యాణ వేదిక వద్ద తునికి చెందిన మహిళల కోలాట ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద ప్రతిరోజూ పలు సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అన్నమయ్య కీర్తనలు, చిన్నారుల భరతనాట్యం, నృత్యాలు, కోలాట ప్రదర్శనలు భక్తులను విశేషంగా అలరిస్తున్నాయి.



ప్రారంభిస్తున్న సర్పంచ్

ముత్తూట్ ఫైనాన్స్ బ్రాంచ్ ప్రారంభం

ప్రజాశక్తి -రావికమతం:ఆర్థిక అవసరాలకు ముత్తూట్ ఫైనాన్స్ ఎంతగానో ఉపయోగ పడుతుందని రావికమతం సర్పంచ్ గెంజి మొది నాయుడు అన్నారు. మండల కేంద్రంలో మినీ ముత్తూట్ ఫైనాన్స్ బ్రాంచ్ ను గురువారం సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ముత్తూట్ ఫైనాన్స్ వ్యాపారం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని తెలిపారు. తక్కువ వడ్డీతో రుణాలను అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖకు చెందిన ముత్తూట్ ఫైనాన్స్ రీజనల్ మేనేజర్ కృష్ణారావు, బ్రాంచ్ మేనేజర్ సంజీవరావు, వైఎస్ఆర్సిపి మండల పార్టీ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మి నాయుడు, మాజీ సర్పంచ్ జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి- నక్కపల్లి:ప్రకృతి వ్యవసాయంపై రైతుల కు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం వెలుగు ఏపీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ, డిఆర్డిఏ, ప్రకృతి వ్యవసాయ శాఖ, వ్యవసాయ అనుబంధ శాఖలు సిబ్బందికి ఖరీఫ్ -2025 ప్రణాళికపై అవగాహన కల్పించుటకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఆరోగ్య భద్రత, పర్యావరణ సంరక్షణ ధృష్ట్యా ప్రకృతి వ్యవసాయం చేయవలసిన ఆవశ్యకత నెలకొందన్నారు.నవధాన్యాల సాగు, ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (నవధాన్యాలు)తో ఉపయోగాలు గురించి వివరించారు. అందరూ సమిష్టిగా కృషి చేసి జానకయ్య పేట గ్రామాన్ని నూరు శాతం ప్రకృతి వ్యవసాయ గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు.వెలుగు ఏపీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామస్థాయిలో ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ సాయి కుమారి,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆర్ ఎస్కె సిబ్బంది రాజ్యలక్ష్మి, మౌనిక, కొండలరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి



పనులు పరిశీలిస్తున్న ఎంపిటిసి

కాలువ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోటలోని అంబేద్కర్ కాలనీలో మండల పరిషత్ నిధులతో చేపట్టిన సిసి మురుగు నీటి కాలవ నిర్మాణానికి కొత్తకోట ఎంపిటిసి పూడి మరిడియ్య (దేవ),అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎం పిటిసి పూడి దేవ మాట్లాడుతూ, స్థానిక అంబేద్కర్ కాలనీలో గత 20 ఏళ్ళ కిందట నిర్మించిన సిసి డ్రైన్ కాలవ పూర్తి స్థాయిలో శిథిలం కావడం తో రోడ్డుపై మురుగు చేరి తీవ్ర దుర్గంధం వెద జల్లుతోందన్నారు. దీంతో మండల పరిషత్ నుంచి సుమారు రూ. 3 లక్షల నిధులు వెచ్చించి నిర్మాణ పనులు చేపట్టామన్నారు. కాలవ నిర్మాణం పట్ల అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు బి. బుల్లిబాబు, అప్పారావు, శేఖర్ హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి

ప్రజాశక్తి- మాడుగుల:పిల్లలను ఎప్పుడు చరవాణిలకు, సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలని అనకాపల్లి ప్రధాన సివిల్ జడ్జి ధర్మారావు అన్నారు. మండలంలోని లీగల్ సర్వీసెస్ అథారటీ ఆధ్వర్యంలో సాగరం కస్తూరిభా పాఠశాలలో బాడ్ టచ్ గుడ్ టచ్ పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎవరైనా చెడుగా పిల్లల పట్ల ప్రవర్తిస్తే వెంటనే టీచర్లకు, తల్లిదండ్రులకు చెప్పాలని సూచించారు.వచ్చే సెలవులలో తల్లిదండ్రులకు సాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చోడవరం బార్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనాద్ ప్రసాదరావు, మాడుగుల కోర్టు సిబ్బంది,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి

కెజిబివిలో తనిఖీలు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని గురువారం స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ జి.దేవి సందర్శించారు. విద్యార్థులకు అందించే భోజనం, ఆహార పదార్థాలను పరిశీలించారు. కూరగాయలు, నిత్యావసర సరుకులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనం, ఇతర ఆహార పదార్థాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈ లు కే నరేష్, వేమగిరి నూకరాజు, డివిడి ప్రసాద్, విద్యాలయం ప్రత్యేక అధికారి షేక్ షలీమా పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:పల్లె గ్రామాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని మండల ప్రత్యేక అధికారి ప్రసాద్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎంపీడీవో డి సీతారామరాజు ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 15 న నిర్వహించనున్న స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలన్నారు. అన్ని గ్రామాల్లోనూ శానిటేషన్ పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, పరిసరాల పరిశుభ్రత పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఉద్యోగులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి ప్రసాద్



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఘనంగా ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి -రావికమతం: మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించి ఒకరి కొకరు ఆత్మీయంగా చివరిసారిగా ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు బంటు సత్యారావు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోగులు ఆధార్ కార్డు తెచ్చుకోవాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఈ హాస్పిటల్ ప్రవేశపెట్టిన సందర్భంగా రోగులంతా మొబైల్ లింకుతో గల ఆధార్ ఆధార్ కార్డును చికిత్సకు వచ్చేటప్పుడు తీసుకురావాలని కోటవురట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ వరప్రసాద్ తెలిపారు, ఈ హాస్పిటల్ ద్వారా రోగి పూర్తి వివరాలు అందులో పొందు పరిస్తామన్నారు.ఆధార్ నెంబరు ఎంటర్ చేస్తే గతంలో తీసుకున్న చికిత్స, వాడిన మందుల వివరాలు తెలుస్తాయన్నారు. రోగులంతా గమనించి హాస్పిటల్‌కి వచ్చేటప్పుడు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకు రావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:మత్స్యకారుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు ముడి మహేష్ కోరారు. నక్కపల్లి, ఎస్ రాయవరం మండలాల మత్స్యకారులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నక్కపల్లి, ఎస్ రాయవరం మండలాల్లో మండల, గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకుగాను మత్స్యకారులు సన్నద్ధం కావాలన్నారు. మండల, గ్రామస్థాయిలో మత్స్య సంక్షేమ సమితిని బలోపేతం చేయాలన్నారు. ముఖ్యంగా మత్స్యకార యువత గ్రామాల్లో మత్స్యకారుల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు వాసుపల్లి శివ, కారే దరరాజు, చోడిపల్లి అప్పలరాజు, జి రాంబాబు, మైలపల్లి ప్రసాద్, గరికిన రాజేష్, శివాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు మహేష్



హోలీ అక్షరాలను చెక్కిన సూక్ష్మ కళాకారుడు

సూక్ష్మ కళాకారుని ప్రతిభ

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి తన సూక్ష్మ కళతో శుభాకాంక్షలు తెలిపాడు. శుక్రవారం హోలీ పండుగ సందర్భంగా చెక్కతో హోలీ అక్షరం చెక్కి తన సూక్ష్మ కళ ను ప్రదర్శించాడు.సహజ వనరులు చెట్ల ఆకులు, పుష్పాలు ఉపయోగించి హోలీ పండుగను జరుపుకోవాలని, ప్రమాదకరమైన రంగులకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశాడు.


మాట్లాడుతున్న అప్పలరాజు

దళితుల డి- ఫారం భూములకు

రూ.60 లక్షల పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి- నక్కపల్లి:వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పరిశ్రమలకు రోడ్డు ఏర్పాటు చేయడానికి సేకరించిన కాగిత దళితుల డీఫారం భూములకు 60 లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. గురువారం దళితులతో కలిసి భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారిడార్ రోడ్డు ఏర్పాటుకు న్యాయం పూడి, కాగిత, వేంపాడు రెవెన్యూ పరిధిలోని జిరాయితీ, డీ ఫారం భూములు సేకరిస్తున్నారని, కాగిత రెవెన్యూ పరిధిలోని జిరాయితీ భూములకు ఎకరానికి 60 లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించడం జరిగిందని తెలిపారు. కాగిత డీఫారం భూములకు కూడా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగిత డీఫారం భూములకు రెవెన్యూ అధికారులు 30 లక్షలు మాత్రమే చెల్లిస్తామని చెబుతున్నారని, ఇది చట్ట ఉల్లంఘణ అవుతుందన్నారు. దళితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, మండల కార్యదర్శి ఎం.రాజేష్, ఎస్.పెద్దిరాజు,ఆనంద్, కృష్ణ, అప్పారావు, ప్రవీణ్, కిరణ్ ,రవి, చంటి తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ చెబుతున్న నాయకులు

మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-నక్కపల్లి:ఈనెల 24న హోం మంత్రి వంగలపూడి అనిత పుట్టిన రోజు సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ హెటిరో డ్రగ్స్ క్రీడా మైదానంలో గురువారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది. మొదటి రోజు 5 మ్యాచ్‌లు జరిగాయి.. క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ తెలిపారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ సేవా పథకం, కళాశాల రెడ్ క్రాస్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరాన్ని ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్ ప్రారంభించారు. శిబిరంలో 30 మంది విద్యార్థులు రక్తదానం చేశారు.మహిళా కళాశాల ప్రిన్సిపల్ పి.చలపతిరావు, అరకు సిఐ ఎల్ హిమగిరి పాల్గొన్నారు.

సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో సమస్యలు ఏకరువు


నర్సీపట్నంలో సమస్యలు తెలుసుకుంటున్న నేతలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మండలంలోని చెట్టుపల్లి పంచాయతీలో సిపిఎం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత కాలనీలో సందర్శించి అనేక సమస్యలు గుర్తించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రాజు మాట్లాడుతూ, ఐదు రోజులుగా కాలనీలో మంచినీటి సరఫరా లేక దళితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండు చేతిపంపులు ఉన్నా అనేక నెలలుగా పనిచేయలేదన్నారు. వాటర్ ట్యాంకు ద్వారా నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇంటింటికి కుళాయిలు కాలనీలో కానరాలేదన్నారు. ఆరు వారాలగా పనిచేస్తున్న ఉపాధి హామి పథకం కూలిలకు డబ్బులు నేటికీ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రభ, ఎస్ నాగరమణ, గీత, కృష్ణ, విశ్వనాథం పాల్గొన్నారు.

కె.కోటపాడు:చోడవరం సహకార చక్కెర కర్మాగారానికి రైతులు సరఫరా చేసిన చెరుకుకు బకాయిలు వెంటనే చెల్లించాలని సిపిఎం నాయకులు గండి నాయనబాబు డిమాండ్ చేశారు. మండలంలోని రొంగలి నాయుడుపాలెం గ్రామంలో గురువారం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా చెరుకు రైతులతో మాట్లాడారు సుగర్ ఫ్యాక్టరీ ఇప్పటివరకు రైతులకు రూ.35 కోట్లు బకాయి ఉందని తెలిపారు. ఫ్యాక్టరీ ఆవరణల ఈనెల 21న జరుగు ధర్నాలో రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పార్టీ నాయకులు ఎర్ర దేవుడు, రొంగలి ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలోని చిన్న కాలవలపల్లి, కొత్తపేట గ్రామాలలో సిపిఎం నాయకులు ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి దేముడునాయుడు, సభ్యులు నాగుమంత్రి నారాయణరావు, ఎరిపెల్లి రాము మాట్లాడుతూ ఉపాధి కూలీలకు బకాయి ఉన్న ఎనిమిది వారాల కూలి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.


పెందుర్తిలో..

వేపగుంట :సిపిఎం గోపాలపట్నం జోన్ ఆధ్వర్యంలో 92 వార్డు బంటా కాలనీ, చైతన్య నగర్‌లో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా కొండవాలు ప్రాంత సమస్యలపై స్థానికులు విన్నవించారు. ప్రతిచిన్న అవసరానికి కొండ ఎక్కిదిగి రావాల్సిన పరిస్థితుల్లో మెట్లమార్గం లేక ఇబ్బందులు పడుతున్నారని, చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు పడుతన్న ఇక్కట్లను దృష్టిలో పెట్టుకుని మెట్ల మార్గం నిర్మాణంతోపాటు కరెంట్‌స్తంభాలు వేసి చీకటికష్టాలకు విముక్తి కల్పించాలని కోరారు. రోడ్లు, తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అలాగే ఎన్నోఏళ్లుగా ఉంటున్నా తమకు కనీస సౌకర్యాలు లేవని చైతన్యనగర్ వాసులు విన్నవించారు. కొండపై తాగునీటి ట్యాంకు నిర్మించినా ప్రారంభించకపోవడంతో దాహార్తితో అల్లాడిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు బి. పద్మ, జిల్లా నాయకులు బి. రమణి, జోన్ నాయకులు వెంకటలక్ష్మి, రమణమ్మ, సత్యవతి, పార్వతి పాల్గొన్నారు.


గాజువాకలో...


కె.కోటపాడులో..

గాజువాక : జిఒ296 ప్రకారం ఇచ్చిన పట్టాలను రిజిస్ట్రేషన్ చేయాలని జివిఎంసి 71వ వార్డు అరుణోదయ కాలనీ, సుందరయ్య కాలనీవాసులు కోరారు. గురువారం సిపిఎం ప్రజాచైతన్యయాత్రలో భాగంగా ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు బృందంగా ఆయా కాలనీల్లో పర్యటించి, ఇంటింటికి వెళ్లి స్థానిక నివాసితుల సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి వివరాలను సేకరించారు.

ఈ సందర్భంగా జిఒ 296 పట్టాలకు రిజిస్ట్రేషన్ చేస్తామని ఎన్నికల ముందు స్థానిక ఎమ్మెల్యే హామీఇచ్చినా నేటికీ అమలు చేయలేదని సిపిఎం నేతల దృష్టికి తెచ్చారు. అలాగే సుందరయ్యకాలనీలో ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ సమస్యతోపాటు స్థానికంగా రోడ్లు, కాలువలు, ఇతర సమస్యలను సర్వేలో సిపిఎం జోన్ కార్యదర్శి ఎం రాంబాబు, సుందరయ్య కాలనీ శాఖ కార్యదర్శి డి శ్రీనివాస్ జోన్ కమిటీ సభ్యులు ఎస్ కృష్ణమూర్తి కమిటీ సభ్యులు ఎస్ లక్ష్మి, కె.పద్మలకు విన్నవించారు.


రాంబిల్లిలో...

ఉపాధి హామీ పనులు కల్పించాలి

- గిరిజనుల నిరసన

ప్రజాశక్తి -కొత్తకోట:స్వయంగా జిల్లా కలెక్టర్ తమ గ్రామాన్ని సందర్శించి ఉపాధి హామీ పనులు కల్పిస్తా మని హామీ ఇచ్చినా ఇంత వరకూ ఉపాధి హామీ పథకం పనులు కల్పించక పోవడంతో రావికమతం మండలం చీమలపాడు శివారు కొండ శిఖర గ్రామమైన చలి సింగంలో ఆదివాసీ గిరిజనులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గిరిజన లబ్ధిదారులు చీపురు వరలక్ష్మి, గంగయ్యమ్మ, వడ్డప సత్యవతి, చీపురు సర్వసతి తదితరులు మాట్లా డుతూ, గ్రామంలో సుమారు 150 కుటుంబాలలో జాబ్ కార్డులు కలిగి ఉన్నామన్నారు. జాబ్ కార్డులు ఉన్నప్పటికీ ప్రతి ఏటా ఉపాధి పనులు కల్పించడం లేదని వాపోయారు. ఇటీవల తమ గ్రామాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్‌కు ఉపాధి పనులు కల్పించాలని కోరామని గిరిజనులు పేర్కొన్నారు. గ్రామ సరి హద్దులో వ్యవసాయానికి సంబంచిన చెరువులు ఉన్నాయని గ్రామం మొత్తం వ్యవసాయం పై ఆధార పడి జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ఉపాధి పనులు కల్పించక పోవడంతో జీవనం నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలస పోతున్నామని వాపోయారు. దీంతో తమ పిల్లల విద్య పై ప్రభావం చూపుతోందని ఆందోళ న వ్యక్తం చేశారు. తక్షణమే తమకు ఉపాధి పనులు కల్పించాలని సంబందిత అధికారులను డిమాండ్ చేశారు...


నినాదాలు చేస్తున్న గిరిజనులు

ఐద్వా ఆధ్వర్యంలో వైద్య శిబిరం


విద్యార్థులతో వైద్యులు, నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో గురువారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో విశాఖపట్నం మెడికవర్ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు గ్రామ ప్రజలకు, విద్యార్థులకు, షుగర్, బిపి, గుండె, క్యాన్సర్ వ్యాధిలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ, మారుమూల గ్రామాల్లో మెరుగైన వైద్యం అందించడం మెడికవర్ లక్ష్యం అని అన్నారు. పరిసరాలు పరిశుభ్రముగా ఉంచుకోవాలన్నారు. తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు.వైద్య సేవలు అందించిన వైద్య సిబ్బందికి ఐద్వా జిల్లా కార్యదర్శి డి డి వరలక్ష్మి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య వేదిక కన్వీనర్ కామేశ్వరరావు, అల్లూరి విజ్ఞాన కేంద్రం పరిశీలకులు పద్మ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం. అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం. సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు డి.శ్రీనివాసరావు, నాయకులు ఎం. రాజేష్, మహేష్, దావీదు రాజు, జాను, రాజు, సోమేశ్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గురువారం పరీక్ష సామాగ్రిని అందజేశారు. కేవీ పాలెం హాస్టల్ వార్డెన్ ప్రవీణ్ రూ. 20 వేల ఆర్థిక సాయంతో విద్యార్థులకు అట్టలు, పెన్నులు, పౌచ్‌లు విద్యాసామాగ్రిని సమకూర్చారు. ఈ మేరకు హెచ్ఎం రాణి లలిత ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులతో సమావేశం నిర్వహించి, వార్డెన్ అందజేసిన విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాణి లలిత, ఉపాధ్యాయులు హాస్టల్ వార్డెన్‌ను అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు టి.వి.రమణ, సత్యవతి, సుందరరావు, రూప్సీరాణి, పద్మావతి, ఎస్.వి.ఎస్.ఆచార్యులు పాల్గొన్నారు.